క్లుప్తంగా

నేడు పోపూరి శ్రీనివాసశర్మ గాత్ర కచేరి

నల్లకుంట: నాగోల్ బండ్లగూడలోని శ్రీవిష్ణు సహస్రనామ క్షేత్రం ఆవరణలో నేడు సాయంత్రం 5 గంటలకు పోపూరి శ్రీనివాసశర్మచే గాత్ర కచేరి ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. సరస్వతీ సంగీత విద్యాలయం ఈ-వెంట్ మేనేజర్లు తేజస్విని, యశస్విని బుధవారం మాట్లాడుతూ.. దీనికి వయోలిన్‌పై అచ్యుతరావు, మృదంగంపై కుమార్ వాద్య సహకారమందిస్తారన్నారు. విష్ణు సహస్రనామ క్షేత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం ఉంఛవృత్తి, యామ విభాగంతో అన్యోన్య సహాయంతో జపయజ్ఞం, యామాంత సహస్రనామార్చనలు, ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం మహావిష్ణు లక్ష విష్ణు నామాలతో తులసీ, బిల్వ, పుష్పార్చనలు ఉంటాయన్నారు.

నేడు క్రైస్తవుల సమాలోచన సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 10న ఉదయం 10 గంటల నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత క్రైస్తవుల సమాలోచన సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు సాధన సమితి వ్యవస్థాపకుడు నాగళ్ల పోచయ్య ఇస్రాయల్ తెలిపారు. ఈ సదస్సులో అన్ని క్రిస్టియన్ మేయిన్ లైన్ ఇనామిలేషన్, ఇండిపెండెంట్ చర్చిల ఫాస్టర్లు, బిషప్ విశ్వాసులు, దళిత క్రైస్తవ కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 1950 ఆగస్టు 10లో రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా కోల్పోయిన ఎస్సీహోదాను సాధించుకునేందుకు క్రైస్తవులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: నగర పోలీస్ కమీషనర్ సీవి ఆనంద్‌కు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీగా పదోన్నతి వచ్చిన సందర్భంగా బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

హిమాయత్‌నగర్ తహసీల్దార్‌గా సంధ్యారాణి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్‌గా డి.సంధ్యారాణి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలను పురస్కరించుకుని జరిగిన బదిలీల్లో భాగంగా హయత్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమె హిమాయత్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

మాజీ సైనికులకు సత్కారం


సత్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో 'నా మట్టి - నాదేశం' కార్యక్రమం జరిగింది. బుధవారం భారత మాజీ సైనికులను శాలువాతో సత్కరించి అభినందించి జ్ఞాపికలను ప్రదానం చేశారు. పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు సైనికులను ఘనంగా సత్కరించారు. నందకిషోర్‌యాదవ్, సుభాషిణి, సి.వినోద్‌కుమార్ యాదవ్, కెప్టెన్ కృష్ణగౌడ్, యశ్వంత్, శ్రీధర్, భూషణ్, ఎస్ఎస్ రాము పాల్గొన్నారు.

డ్రైనేజీ మరమ్మతులు

కాచిగూడ: మౌలానా ఆజాద్‌నగర్ బస్తీలో డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం పాదయాత్ర నిర్వహించిన కాచిగూడ కార్పొరేటర్ దృష్టికి స్థానికులు సమస్యను తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆమె జలమండలి అధికారులు, సిబ్బందిని పిలిపించి డ్రైనేజీకి మరమ్మతులు చేయించారు. ఏతః సారిక, బీజేపీ నేతలు భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, రామకృష్ణ, రాజీవ్, ప్రసాద్, ఆర్.సంతోష్, శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి - ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (35) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కలవర పెడుతున్న 'కళ్ల కలక'

కంట్లో చిన్న నలక పడితే భరించలేం. అలాంటిది కళ్ల నిండా ఇసుక పోసినట్లుగా ఉండి ఒకటే మంట, దురదగా ఉంటే ఆ బాధను భరించడం కష్టం. కళ్ల కలక(మద్రాస్ ఐ) అలాంటి జబ్బే అంటున్నారు నిపుణులు. ఇది అంటు వ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి తేలికగా వ్యాపిస్తుందని చెబుతున్నారు. సుమారు పదేళ్ల తర్వాత మళ్లీ పడగ విప్పిన ఈ అంటు వ్యాధితో చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాంతాన్ని బట్టి మద్రాస్ ఐ, పింక్‌ఐగా పిలిచే ఈ కళ్ల కలక ప్రాణాంతకం కాకపోయినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రమేష్

- జంటనగరాల్లో పెరుగుతున్న 'కళ్ల కలక' కేసులు
- కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారుల సూచన

నల్లకుంట: హైదరాబాద్ జిల్లాతో పాటు గ్రామాల్లో సైతం కళ్ల కలకతో వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. ఒక్క నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికే నిత్యం పదుల సంఖ్యలో కళ్ల కలకతో చికిత్సల కోసం వస్తున్నారు. ఇక ప్రైవేట్ కళ్ల దవాఖానాలకు కూడా అదే రీతిన బాధితులు చికిత్సల కోసం బారులు తీరుతున్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కళ్ల కలక బారిన పడటంతో హాజరుశాతం కూడా తగ్గిపోతోంది.

- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు తీసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జి. రమేష్ పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సాక్షితో పంచుకున్నారు.

వ్యాధి లక్షణాలివే..

- కళ్ల కలక 'ఎడినోవైరస్' వల్ల సంక్రమిస్తుంది. ముఖ్యంగా ఇది వర్షాకాలంలోనే వ్యాపిస్తుంది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటం వల్ల ఎడినో వైరస్ యాక్టివేట్ అయ్యి ఒక ప్రాంతమంతా వ్యాపించే అవకాశం ఉంది. దీన్ని అడినోవైరల్ ఇన్ఫెక్షన్ అని కూడా అంటారు. సాధారణంగా ఈ వ్యాధి వైరల్ కంజెక్టివిటీస్, బ్యాక్టీరియా కంజెక్టివిటీస్ ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకడం వల్ల కళ్లు ఎర్రబారటం, ఉబ్బటం, రెప్పలు వాయడం, వెలుగును చూడలేక పోవడం, కంటి నుంచి నీరు కారడం, రెప్పలు అతుక్కుపోవడం, చూపు కూడా కొంత మసక బారడంతో జ్వరం కూడా వస్తుంది.

వ్యాప్తి నివారణకు జాగ్రత్తలు..

- కళ్ల కలక బారిన పడిన వారు జాగ్రత్తలు పాటిస్తే కళ్ల కలక ఇతరులకు వ్యాపించకుండా నివారించవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.
- వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు నల్ల కళ్లజోడు వాడాలి. ఇతరులకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. కరచాలనం (షేక్ హ్యాండ్) చేయడం, తాకడం మానుకోవాలి.
- చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. కంటిని నులమడం, రుద్దడం లాంటివి చేయకూడదు.
- కళ్ల కలకతో బాధపడే వారు వాడిన సబ్బు, బెడ్ షీట్లు, టవళ్లు ఇతరులు వినియోగించకూడదు. కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు కళ్ల కలక బారినపడితే వారు రెండు లేదా మూడు రోజులు సెలవు పెట్టడం మంచిది.
- కళ్ల కలక బాధితుల దగ్గరకు చిన్నారులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి నయమయ్యే వరకు కాస్మోటిక్స్ వాడటం ఆపేయాలి.

తేలిగ్గానే నయం చేసుకోవచ్చు



'కళ్ల కలక' బాధితులు చికిత్సల కోసం రోజూ ఆసుపత్రికి వస్తున్నారు. వారికి పరీక్షలు నిర్వహించి మందు ఇచ్చి పంపిస్తున్నాం. అత్యవసరమైన వాళ్లను ఇన్ పేషంట్లుగా చేర్చుకుని చికిత్సలు అందిస్తాం. కళ్ల కలక సోకిన వారు చిన్నపాటి చికిత్సలతోనే వ్యాధిని నయం చేసుకోవచ్చు. ఎక్కువగా మందులు వాడాల్సిన పని ఉండదు. కళ్లను శుభ్రంగా కడుక్కోవడంతో పాటు లూబ్రికేషన్ డ్రాప్స్ లేదా యాంటీ బయోటిక్ చుక్కల మందు లేదా అయోడిన్ డ్రాప్స్, ఆయింట్‌మెంట్‌ను వైద్యులను సంప్రదించి మాత్రమే వాడాలి. కళ్ల జోడు పెట్టుకుంటే ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందకుండా ఉంటుంది. తగిన జాగ్రత్తలు పాటిస్తే రెండు, మూడు రోజుల్లో వ్యాధి తగ్గిపోతుంది.

– ప్రొఫెసర్ డాక్టర్ కె. శంకర్, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

జాగ్రత్తలు తీసుకోవాలి



కళ్ల కలక బారినపడిన వారు కళ్లను తరచూ మంచినీటితో కడుక్కోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మురికిగా ఉన్న చేతులతో కళ్లను తాకకూడదు. సబ్బు నీటితో తరచూ చేతులను కడుక్కోవాలి. కళ్లు దురదగా అనిపిస్తే పదేపదే కళ్లను రుద్దకూడదు. శుభ్రమైన కాటన్ క్లాత్‌తో తుడుచుకోవాలి. గాలి ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది, కాబట్టి ఇతరులకు దూరంగా ఉండాలి. నిపుణులైన వైద్యుల సూచనల మేరకే ఐ డ్రాప్స్ వాడాలి. ఆఫీసులు, స్కూళ్లు, కళాశాలల్లో ఎవరికైనా 'కళ్ల కలక' ఉంటే వారికి కాస్త దూరంగా ఉండటం మంచిది.

– డాక్టర్ జి. రమేష్, రమేష్ ఐ కేర్ సెంటర్ ఎండీ, హిమాయత్ నగర్

దశాబ్దాల రహదారి మూసివేత

విస్తరణకు విన్నవిస్తే మూసివేశారని స్థానిక నేతల ఆగ్రహం

అంబర్‌పేట: సామాన్య ప్రజలు రాకపోకలు సాగించే దారిని పోలీస్ విభాగం మూసివేసింది. దశాబ్దాల తరబడి కాలినడకన ద్విచక్ర వాహనానికి వెళ్లే వీలుండే చిన్నపాటి రహదారిని బుధవారం పోలీసులు బారికేడ్లు పెట్టి రాకపోకలను నిలిపివేశారు. అంబర్‌పేట డివిజన్‌కు సామాన్యులు పోలీస్ శిక్షణ కేంద్రం మధ్యలో నుంచి గత కొన్ని దశాబ్దాలుగా రాకపోకలు సాగిస్తున్నారు. కేవలం ద్విచక్ర వాహనాలు, పాదాచారులు వెళ్లేందుకు వీలుండే ఈ రహదారి సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉంది. ఈ చిన్నదారి గుండా అంబర్‌పేట ప్రధాన రోడ్డు గాంధీ చౌరస్తా నుంచి ప్రేమ్‌నగర్, పటేల్‌నగర్, ఆజాద్‌నగర్, అహ్మద్‌నగర్ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. నాలుగు రోజుల క్రితం బీజేపీ నేత ఆనంద్‌గౌడ్ ఇక్కడ ఉన్న చిన్నదారితో పాటు మరో చిన్న దారి ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ సీవీ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాగా సమస్య పరిష్కరించాలని వినతిపత్రం ఇస్తే.. ఏకంగా దారిని మూసివేయడం అంబర్‌పేటలో చర్చానీయాంశమైంది. మూసిన దారిని పోలీసు విభాగం తక్షణమే తెరవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధానిని కలిసిన డాక్టర్ కె. లక్ష్మణ్


ప్రధానితో కుటుంబ సమేతంగా ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్


ముషీరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీని పార్లమెంటులోని పీఎం ఆఫీసులో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కుటుంబ సమేతంగా కలిశారు. 20 నిమిషాలకు పైగా జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారని కష్టపడితే అధికారంలోకి వస్తామని ప్రధానికి లక్ష్మణ్ వివరించినట్లు సమాచారం. పార్లమెంటు వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రధాని సూచించారన్నారు. లక్ష్మణ్ కుమారుడు రాహుల్, సతీమణి ఉమా ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: నియోజకవర్గంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల ఆధునీకరణకు ఆరు డివిజన్ 28 ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని సాయిరెడ్డి పటేల్‌నగర్ రామాలయం వీధిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిరెడ్డి పటేల్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్లు అధ్వానంగా మారడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. యువజన విభాగం నగర నాయకుడు ముఠా గోపాల్, టి.సోమన్, నర్సింగ్‌ప్రసాద్, అరుణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, డి.శివముదిరాజ్, రవియాదవ్, పరశురాంయాదవ్, సదా తదితరులున్నారు.

వృద్ధుడి అదృశ్యం


మల్లేష్ (ఫైల్)

నల్లకుంట: నేత్ర పరీక్షల కోసం వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై జే. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేటు ఉద్యోగిణి లావణ్య కుటుంబ సభ్యులతో కలిసి విద్యానగర్ సరోజ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తోంది. కాగా ఆమె తండ్రి డి. దోసల మల్లేష్(77) కుమార్తె వద్దే ఉంటున్నాడు. ఈ నెల 7న ఉదయం 6 గంటల సమయంలో రసూల్‌పురలో కంటి పరీక్షలు చేయించుకుని వస్తానని చెప్పి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన కుమార్తె మంగళవారం రాత్రి నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయ సంస్కృతిలో ఆదివాసీలు భాగం


శుభాకాంక్షలు తెలుపుతున్న శంబుల ఉషా శ్రీకాంత్‌గౌడ్

అంబర్‌పేట: భారతీయ సంస్కృతిలో ఆదివాసీయులు ఓ భాగమని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంబుల ఉష శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా బాగ్‌అంబర్‌పేట సోమసుందర్‌నగర్‌లో పలువురు గిరిజనులకు ఆమె శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు. టీపీసీసీ కార్యదర్శి శంబుల శ్రీకాంత్‌గౌడ్, భూక్య వీరణనాయక్, వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రావణ బోనాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. బుధవారం బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్లతో పోతరాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించిన భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ముషీరాబాద్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కుభర్తిశివ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనాథ్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్, లడ్డూయాదవ్, అంజియాదవ్, ఆర్.వివేక్, లిట్టూ తదితరులున్నారు.



మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

చిక్కడపల్లి: ఓ వ్యక్తి మెట్లపై నుంచి పడి మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... అశోక్‌నగర్ ఎస్ఆర్టీ 334 క్వార్టర్స్‌లోని రెండో ఫ్లోర్ మెట్లపై 56 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా.. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వివరాలు సేకరించగా.. మృతిడి జేబులో ఉన్న ఆధార్‌కార్డులో మృతుడు శేపూరి శ్రీనివాస్ తండ్రి లక్ష్మీనారాయణగా గుర్తించారు. మృతుడు బాగ్‌లింగంపల్లి చిన్న, చిన్న పనులు చేసుకుంటేవాడని, అడ్రస్ వివరాలు కార్వాన్, ఆసిఫ్‌నగర్‌గా ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి వివరాల కోసం బాగ్‌లింగంపల్లిలో విచారణ చేపట్టామన్నారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి వ్యాపారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారికి ఆర్థిక చేయూతను ఇవ్వాలని బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రామ్ కోరారు. బుధవారం జగదీష్‌మందిర్‌లో ట్యాంక్‌బండ్ వెండర్స్ అండ్ హాకర్స్ యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షుడు మల్లంపేట రమేష్‌రామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధివ్యాపారులందరూ నిరుపేదలని, రెక్కాడితే.. డొక్కాడని పరిస్థితిలో ఉన్నారని వారిని కేంద్రం ఆదుకోవాలని కోరారు. ట్యాంక్‌బండ్‌ను జీహెచ్ఎంసీ గ్రీన్‌జోన్‌గా ప్రకటించాలని అధికారులకు విన్నవించారు. యూనియన్ సభ్యులందరికీ బీఎంఎస్ యూనియన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. రవీందర్‌రాజ్, రవిశంకర్, ఏ.శంకర్, మధు, విశ్వనాథ్, గణేష్, శాంతమ్మ, రమేష్, యాకన్న, జగదీష్ తదితరులున్నారు.

హౌజింగ్ బోర్డు స్థలాలను కాపాడాలి


హౌజింగ్ బోర్డు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని హౌసింగ్ బోర్డు స్థలాలను కబ్జాల నుంచి కాపాడాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కోరారు. బుధవారం సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని ఎంఐజీలో కబ్జాకు గురైన స్థలాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖాళీ స్థలాలను బీజేపీ నేతలు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. చుట్టూ ఉన్న ప్రహరీల కంచెలను తొలగించి రేకుల షెడ్డు వేసి యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. దీనిపై హౌజింగ్ బోర్డు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సదరు నాయకులపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా హౌజింగ్ బోర్డు అధికారులు స్పందించి తగిన స్థాయిలో విచారణ చేపట్టి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం ముషీరాబాద్ కార్యదర్శి ఎం.దశరథ్, కె.రమేష్, ఏ.శ్రీరాములు, కె.రాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి


ఇందిరాపార్కు చౌరస్తాలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరాపార్కు చౌరస్తాలో కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు పోతరాజు భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ జెండాను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు వి.డి.కృష్ణ, కె.ఆర్.కె.ప్రసాద్, పి.లక్ష్మణ్, ప్రభాకర్, పాశం అనిల్, సాయిబాబా, మల్లేష్‌యాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ

ముషీరాబాద్: నియోజకవర్గంలోని 54 చర్చిల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాంనగర్ చౌరస్తా నుంచి బాకారం వెస్లీ చర్చి వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పలువురు ఫాస్టర్లు, పాదర్లు బుధవారం రాంనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. 170 మంది దాడుల్లో చనిపోయారని, 60 వేల మంది ప్రజలు నిరాశ్రయులై క్యాంపుల్లో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫాదర్ ప్రవీణ్, రెవరెండ్ డాక్టర్ టీ.ఎస్.లెమ్యూల్, రెవరెండ్ డానియల్, ఫాస్టర్ చార్లెస్, ఫాస్టర్ సీ.హెచ్.మధు, రెవరెండ్ డాక్టర్ మరిదాస్, రావులపాటి మోజెస్, డేవిడ్‌రాజ్, బ్రదర్ దీన్‌దయాల్, మాణిక్యంరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్‌కు అభినందన


అభినందిస్తున్న సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు

కాచిగూడ: ఏసీబీ డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఆర్ శ్రీనివాస్ ఐపీఎస్‌ను సెంట్రల్ పీస్ కమిటీ ప్రధానకార్యదర్శి శ్రీకిషన్ శర్మ, ఎస్.శరత్ శ్యామ్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో శశికాంత్ అగర్వాల్, తేజురావు, ఆర్.ఉమేందర్, ఖాజా గౌసుద్దీన్, ఖాజా మోయిజ్, ఎస్.నారాయణరెడ్డి, డాక్టర్ మజారుద్దీన్, ఉదయశ్రీరెడ్డి తదితరులున్నారు.

ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ మాల మహానాడు నాయకులు

ముషీరాబాద్: ట్యాంక్‌బండ్‌పై ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదెకరాల్లో గద్దర్ స్మారక మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రతి ఏటా గద్దర్ పురస్కారాన్ని కవులు, కళాకారులకు అందజేయాలన్నారు. పాఠ్యాంశాల్లో గద్దర్ చరిత్రను చేర్చాలని డిమాండ్ చేశారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట గద్దర్‌కు నివాళులర్పించారు. సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్‌కు కూడా సంతాపం ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, శ్రీరాములు, బ్యాగరి వెంకటస్వామి, పురుషోత్తం, సత్యం, సుధీర్, అంజన్, రవికాంత్ తదితరులున్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలి


సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న డిప్యూటీ ఆర్.ఎం.విజయభాను

కాచిగూడ: సాంకేతిక శిక్షణ పొంది, ప్రయాణీకులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని, సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ విజయభాను అన్నారు. బుధవారం బర్కత్‌పుర డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ఉత్తమ డ్రైవర్లు, ఉద్యోగులకు ప్రగతిరథ చక్రం సర్టిఫికెట్లతో పాటు అవార్డులను ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా 10 మంది కండక్టర్లు, 8 మంది డ్రైవర్లు, 3 మేయింటనెన్స్ ఉద్యోగులు మొత్తం 21 మంది ఈ అవార్డులను అందుకున్నారు. డిపో మేనేజర్ వేణుగోపాల్, ఆర్టీసీ అధికారులు విజయ్‌కుమార్, శ్యామ్‌సుందర్, జయలక్ష్మి, యాదగిరి తదితరులున్నారు.

రక్తదాన శిబిరం


శిబిరంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్

కాచిగూడ: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ దండెబోయిన రవీందర్‌యాదవ్ అన్నారు. నారాయణగూడలోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్', 'పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్' (ఐపీఎం) ఆధ్వర్యంలో బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ హెల్త్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం విషయంలో ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. రక్తదానం చేయటంతో ఇతరులకు సాయం చేయటంతో పాటు ఆరోగ్యానికి కూడా మంచిదని ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట ఓటరు జాబితాకు కృషి

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతి దివాకర్ తెలిపారు. బుధవారం నియోజకవర్గంలో ప్రత్యేకంగా చేపట్టిన ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని ఆ ప్రాంతాల్లో తిరిగి డీఎంసీ పరిశీలించారు. ఇప్పటి వరకు 2,58,704 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అర్హులైన ఓటర్లు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకునేందుకు తమవంతు ప్రోత్సాహం, చైతన్యం కల్పిస్తున్నామన్నారు. విద్యాసంస్థలు, కమ్యూనిటీహాళ్లు, అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ల వద్ద ఓటర్ జాబితాలో పేర్ల నమోదు, సవరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

కాచిగూడ: నేటి పరిస్థితుల్లో విలువలతో కూడిన విద్య సమాజానికి అవసరమని తెలంగాణ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు శ్రీనివాస్‌రావు అన్నారు. సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదినం సందర్భంగా బుధవారం కాచిగూడలో పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిపై విద్యార్థులకు అకుంఠిత దీక్ష ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్, కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌పై పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఎడ్ల నరేందర్‌రెడ్డి, నరేష్‌గౌడ్, రాజు, విజయ్ తదితరులున్నారు.